# సాక్షి వికారాబాద్

బుధవారం। 6। సెప్టెంబర్। 2023



### విద్య కొనసాగేనా?

విజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి మనిషికి తప్పనిసరి అయ్యింది.

8లో▸



### వాహనాన్ని తప్పించబోయి

ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పెట్రోల్ ట్యాంకర్ బోల్తాపడిన సంఘటన పెద్దేముల్‌లో చోటుచేసుకుంది.

8లో▸



### రోడ్డుపై గుంత

రోడ్డు మధ్యలోని మురుగు కాలువపై ఏర్పాటు చేసిన పైకప్పు కుంగిపోవడంతో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది.

9లో▸

## న్యూస్‌రీల్

### దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో తాత్కాలిక పద్ధతిన పాఠ్యాంశాలు బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుమతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్థినులకు గణితం, సైన్స్, బైయో సైన్స్, ఇంగ్లిష్ బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.

### అంగన్‌వాడీ టీచర్లకు ఘన సన్మానం



అంగన్‌వాడీ టీచర్లను సన్మానించిన ట్రస్ట్ సభ్యులు

తాండూరు టౌన్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభప్రద్ పటేల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం తాండూరులో అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ.. చిన్నారులకు తొలి పలుకులు నేర్పేది అంగన్‌వాడీ టీచర్లే అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్, యువసేన సభ్యులు శ్రీశైలం యాదవ్, భాను, బాలు, నరేష్ గౌడ్, విజయ్, మనోహర్, సాయి, చావూస్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం గారూ.. మాట నిలుపుకోండి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆ సంఘం వికారాబాద్ అధ్యక్షుడు చిన్నయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సమ్మె శిబిరం వద్ద ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలోని ఆయా విభాగాల్లో పనిచేసే 264 మంది కార్మికులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విధులు నిర్వహించి ఆ తర్వాత సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం గుర్తించాలన్నారు. పనికి తగ్గ వేతనం అమలు చేయాలని కోరారు. 14 రోజులుగా నిరసనలు తెలుపుతున్నా పట్టించుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. సమ్మెలో మున్సిపల్ కార్మికులు రాజు, వినోద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

### బతికిపోయాడు..

వారించినా వినకుండా వాగు దాటిన వ్యక్తి



నీటి ప్రవాహంలో వంతెన దాటుతున్న రమేశ్

ధారూరు: ఎంతమంది వారించినా వినకుండా ఓ వ్యక్తి ప్రాణాలకు తెగించి వాగు దాటాడు.. అదృష్టం బాగుండి బయటపడ్డాడు. ఈ సంఘటన మంగళవారం మండలంలోని నాగసమందర్ - రుద్రారం గ్రామాల మధ్య గల వంతెన వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నాగసమందర్ గ్రామానికి చెందిన రమేశ్ పని నిమిత్తం ధారూరుకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పారుతుండడంతో నాగసమందర్ - రుద్రారం గ్రామాల మధ్య గల వంతెన పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అయితే రమేష్ వాగు దాటేందుకు సిద్ధమయ్యాడు. రెండు వైపుల నుంచి వద్దని పలువురు హెచ్చరించారు. అయినా లెక్క చేయకుండా ముందుకెళ్లాడు. ఒక దశలో జారిపడే పరిస్థితి ఎదురైంది. తడబడుతూ.. భయంగా వాగు దాటేశాడు. దీంతో అక్కడ ఉన్నవారు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అక్కడే గస్తీ ఉన్న పోలీసులు కూడా చెప్పకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# అదే జోరు..



అలుగు పారుతున్న శివారెడ్డిపేట చెరువు



వికారాబాద్ ప్రధాన కూడలిలో వర్షపు నీరు నిలవడంతో అవస్థలు పడుతున్న వాహనచోదకులు

### జిల్లా వ్యాప్తంగా మూడో రోజూ భారీ వర్షం

- పలు కాలనీలు జలమయం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలు చోట్ల రాకపోకలకు అంతరాయం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- అప్రమత్తంగా ఉండాలి: మంత్రి మహేందర్‌రెడ్డి

వికారాబాద్: జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి దుంకుతున్నాయి. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. పలు చోట్ల రోడ్లకు గండ్లు పడ్డాయి. పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వికారాబాద్, పరిగి, తాండూరులోని పలు కాలనీలు జలమయమయ్యాయి.

**రాకపోకలకు అంతరాయం**

భారీ వర్షాల కారణంగా పరిగి - వికారాబాద్ మార్గంలోని వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వికారాబాద్ - ధారూరు మార్గంలోని వాగు ఉగ్రరూపం దాల్చింది. బ్రిడ్జి పైనుంచి నీరు వెళుతుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లఖ్నాపూర్, జుంటుపల్లి, కోట్‌పల్లి, శివసాగర్ ప్రాజెక్టులు నిండు కుండల్లా మారాయి.

**జాగ్రత్తగా ఉండాలి**

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి మహేందర్‌రెడ్డి సూచించారు. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు, ఇతర అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దన్నారు. పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని సూచించారు.

**కంట్రోల్‌రూమ్ ఏర్పాటు**

ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆయా శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. అత్యవసర సమయంలో సెల్ నంబర్ల 7995061192 లేదా 08416-235291కు కాల్ చేయాలని కలెక్టర్ సూచించారు.

- వికారాబాద్ మండలం మద్గుల్ చిట్టెంపల్లి వాగు పొంగి బ్రిడ్జి పైనుంచి నీరు ప్రవహిస్తుండడంతో పరిగి - వికారాబాద్ మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- వికారాబాద్ - దన్నారం మార్గంలో మూసి వాగు బ్రిడ్జి పైనుంచి నీరు ప్రవహిస్తుండడంతో సిద్దులూర్ వైపు రాకపోకలు ఆగిపోయాయి.
- పరిగి సమీపంలో వికారాబాద్‌కు వెళ్లే మార్గంలో పెద్దవాగు బ్రిడ్జి పైనుంచి నీరు వెళుతుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.
- వికారాబాద్ మండలం గోధుంగూడ, గెరిగెట్‌పల్లి సమీపంలో రైల్వే అండర్ పాస్‌ల నిండా నీరు చేరింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- నవాబుపేట మండలం చిట్టిగిద్ద, చించల్‌పేట్ మార్గాల్లో మూసి వాగు పొలాలను ముంచేసింది.
- ధారూర్ మండలం చింతకుంట, ఎబ్బనూర్, హర్దాస్‌పల్లి, అల్లిపూరు, దోర్నాల్ వాగులు, కోట్‌పల్లి అలుగు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మోమిన్‌పేట - ఎన్కెతల మార్గంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

### అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

వికారాబాద్ అర్బన్: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన ఆయా శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మంగళ, బుధవారాల్లో భారీ వర్షం పడే అవకాశం ఉన్నందున గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. శిథిల గృహాలను గుర్తించి అందులో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చొరవ తీసుకోవాలని సూచించారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలు ప్రజలు దాటకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది గస్తీ నిర్వహించాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, పోలీస్ అధికారులు సమన్వయంలో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# మన పథకాలే ఆదర్శం

- పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- బొంపల్లి పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహం ఆవిష్కరణ

దోమ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలో ఆయా గ్రామాల లబ్ధిదారులకు ఎంపీపీ అనసూయతో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పాలన సాగుతోందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళిత బంధు, బీసీ బంధు, రైతు బీమా వంటి ఎన్నో పథకాలు విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపీటీసీ రాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, బొంపల్లి సర్పంచ్ సురేష్, తహసీల్దార్ పురుషోత్తం, ఎంఈఓ హరిశ్చందర్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం**

పరిగి: బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండలం ఐనాపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి పాల్గొన్నారు.



దోమ: సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే తదితరులు

# ధరల నియంత్రణలో విఫలం

ఇబ్రహీంపట్నం: ధరలను నియంత్రించటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జాన్‌వెస్లీ విమర్శించారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో మంగళవారం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలను తగ్గించాలని బుధ, గురువారాల్లో గ్రామాలు, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నిత్యావసర సరకులు, పెట్రోల్, డీజిల్, మెడిసిన్ ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడి సంపాదించింది నిత్యావసర సరకులు, కూరగాయలకు సరిపోవడంలేదన్నారు. ధరలను నియంత్రించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల యాదయ్య, బోడ సామేల్, ఎం.చంద్రమోహన్, డి.జగదీశ్, డి.రాంచందర్, జగన్, అలంపల్లి నర్సింహ, శ్యాంసుందర్, డి.కిషన్ పాల్గొన్నారు.

# అయ్యో.. ఆదిత్య

- పిచ్చి కుక్క కరిచిన బాలుడి దుర్మరణం
- రేగడిమైలారంలో విషాదం
- భయాందోళనలో కుక్క కాటు బాధితులు



ఆదిత్య మృతదేహం

బొంరాస్‌పేట: 25 రోజుల క్రితం పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారి మంగళవారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆగస్టు 10న బొంరాస్‌పేట మండలం రేగడిమైలారంలో ఓ కుక్క స్వైరవిహారం చేసింది. 2 గంటల వ్యవధిలో 12మందిని కరిచి గాయపర్చింది. వీరిలో ఏడుగురు చిన్నారులు కాగా ఐదుగురు పెద్దవాళ్లు ఉన్నారు. ఇందులో తీవ్రంగా గాయపడిన ఆరుగురిని నగరంలోని నల్లకుంట ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మిగిలిన వారిని వికారాబాద్‌లోని జిల్లా ఆస్పత్రికి పంపించారు. వీరిలో ఆరుగురు చిన్నారులు ప్రస్తుతం మందులు వాడుతున్నారు. ఇదిలా ఉండగా ఆరోజు ఘటనలో తీవ్రంగా గాయపడిన నెల్లి అనురాధ, శ్రీనివాస్‌ల కుమారుడు ఆదిత్య(5) సోమవారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో తల్లిదండ్రులు మంగళవారం ఉదయాన్నే ఆస్పత్రికి తరలిస్తుండగా ఆరోగ్యం విషమించి మార్గమధ్యలోనే మృతిచెందాడు. బాధితులకు వర్షిత, ఆదిత్య ఇద్దరు సంతానం. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మరణించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఆదిత్య మృతితో మిగిలిన చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. పిచ్చికుక్కగాటు బాధితులకు ఉరుములు, మెరుపుల వాతావరణం పడదని పెద్దలు చెబుతున్నారు. వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గురువులు దైవసమానులు

- విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది
- మంత్రి మహేందర్‌రెడ్డి
- ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేత
- సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు: కలెక్టర్ నారాయణరెడ్డి



ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి మహేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

వికారాబాద్: ఉపాధ్యాయులు దైవంతో సమానం.. అన్ని వృత్తుల్లో కల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 75మంది ఉత్తమ ఉపాధ్యాయులను కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమగ్ర శిక్షణ, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో 192 దివ్యాంగ విద్యార్థులకు 278 ఉపకరణాలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, రూ. లక్షా 87 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. గురుకులాల్లో 12వేల పోస్టులు భర్తీ చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సమాజ నిర్మాతలు గురువులని కొనియాడారు. విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. వ్యసనాల బారిన పిల్లలు పడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, ఎస్పీ కోటిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుశీల్‌కుమార్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, డీఈఓ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేలు డుమ్మా

ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా హాజరు కాలేదు. మంత్రి మహేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఇదే మొదటి కార్యక్రమం. ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా ఈ కార్యక్రమానికి గైర్హాజరు కావడం చర్చకు దారితీసింది. మంత్రి పదవి చేపట్టే ముందు వరకు నరేందర్‌రెడ్డి మినహా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు అందరు మహేందర్‌రెడ్డితో అంటీముట్టనట్టు ఉంటూ వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మొదటి కార్యక్రమంలోనే ఎమ్మెల్యేలు పాల్గొనకపోవటం వారిలో సఖ్యత విషయంలో అనుమానాలకు తావిస్తోంది.

# స్కాన్ ఎనర్జీ పరిశ్రమలో ప్రమాదం

- ఎనిమిది మంది కార్మికులకు తీవ్ర గాయాలు
- మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- బాధితులంతా బిహార్ వాసులే



ప్రమాదంలో కాలిపోయిన వాహనం

కొందుర్గు: స్కాన్ ఎనర్జీ (ఐరన్) పరిశ్రమలో మంగళవారం చోటు చేసుకున్న పేలుడులో పలువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. మండుతున్న బట్టి అనుకోకుండా పేలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్ని జ్వాలలు ఎగిసిపడి పక్కనే ఉన్న రెండు లారీలపై పడటంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. మరో వాహనం పాక్షికంగా కాలిపోయింది. ప్రమాదంలో మొత్తం ఎనిమిది మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. ప్రమాదంలో గాయపడ్డ బిహార్‌కు చెందిన రాజీవ్‌యాదవ్, రాజ్‌నారాయణ్, లాల్‌బాబు, మహిమూద్ తదితరులు షాద్‌నగర్ పట్టణంలోని శివరామ్‌నాయక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మిగిలిన నలుగురిని దివ్య ఆస్పత్రిలో చేర్పించినట్లు సమాచారం. కొందుర్గు ఎస్ఐ కృష్ణయ్య సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రమాదంలో చాలా మంది కార్మికులకు గాయాలై ఉంటాయని, విషయం బయటకు పొక్కకుండా యాజమాన్యం జాగ్రత్త పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# దేవాలయాల అభివృద్ధికి చర్యలు

దేవాదాయశాఖ ఎస్ఈ మల్లికార్జున్‌రెడ్డి



ఆలయాల అభివృద్ధిపై ఎమ్మెల్యే అంజయ్యతో చర్చిస్తున్న దేవాదాయశాఖ ఎస్ఈ మల్లికార్జున్‌రెడ్డి

షాద్‌నగర్: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని దేవాదాయశాఖ ఎస్ఈ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పరిధి రామేశ్వరం గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయానికి రూ.5కోట్లు, ఎలికట్ట అంబాభవాని దేవాలయానికి రూ.2కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఆలయాల అభివృద్ధిపై మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, స్థపతి వల్లినాయగం, ఈఓ నరేందర్‌తో చర్చించారు. ఎలికట్ట అంబాభవాని దేవాలయానికి రాతితో పూర్తి స్థాయిలో కాంపౌండ్ వాల్ నిర్మాణం, రామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయానికి రాజగోపురం, ప్రాకార మండపం నిర్మించాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధితోపాటు దూపదీప నైవేద్యాల కోసం నిధుల కేటాయించడం, అర్చకులకు వేతనాల రెట్టింపు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. త్వరలో ఆలయాల అభివృద్ధి పనులకు టెండర్లను పిలవనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక దేవాలయాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అనంతరం రామేశ్వరం దేవాలయంలో ఎస్ఈ మల్లికార్జున్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టే ప్రాంతాలను పరిశీలించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, ఎలికట్ట, రామేశ్వరం ఆలయ చైర్మన్లు కృష్ణయ్య పాల్గొన్నారు.

# భక్తుల ఆరోగ్య రక్షణే ధ్యేయం

### చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్



అర్చకుడు రంగరాజన్‌కు బీపీ చెక్ చేస్తున్న సిబ్బంది

మొయినాబాద్: ఆలయానికి వచ్చే భక్తులకు ఆరోగ్య రక్షణ కల్పించడానికే ప్రాథమిక ఆరోగ్య రక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ అన్నారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ (హెచ్‌హెచ్ఎఫ్), చిలుకూరు బాలాజీ దేవాలయం సంయుక్తంగా ఆలయం వద్ద మంగళవారం ప్రాథమిక ఆరోగ్య రక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీకెండ్‌లో భక్తులు అధిక సంఖ్యలో వస్తారని.. వారికి ఆరోగ్య రక్షణ కల్పించడం తమ బాధ్యతగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. మహాప్రదక్షిణలు చేసే భక్తులకు వైద్య సహాయం అందిస్తామన్నారు. అందుకోసం డాక్టర్, పారా మెడికల్ సిబ్బంది, అంబులెన్స్ అందుబాటులో ఉంటాయన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు.

## క్లుప్తంగా

### అప్రమత్తంగా ఉండాలి

డీఎల్‌పీఓ శంకర్‌నాయక్



వాగు ఉధృతిని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

**బొంరాస్‌పేట:** మూడురోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీఓ శంకర్ నాయక్ సూచించారు. బొంరాస్‌పేట శివారులో ఉన్న వాగును మంగళవారం ఆయన పరిశీలించారు. వంతెనపై ఉధృతిని పరిశీలించారు. జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్నగౌడ్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

### వర్గీకరణ బిల్లు పెట్టాలి

ఎంఎస్‌పీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**అనంతగిరి:** ఈనెల 18 నుంచి జరగనున్న ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఎస్ఎఫ్, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ రాదయ్య, సురేష్, పుష్పరాణి, రవి కుమార్, వంశీకృష్ణ, శ్రీను, ప్రభు పాల్గొన్నారు.

### కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా

**శంషాబాద్:** సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు ధర్నా రెండోరోజుకు చేరింది. మంగళవారం మండల వనరుల కేంద్రం వద్ద వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అజీజ్ మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా చాకిరి చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. గతంలో హామీ ఇచ్చిన ప్రభుత్వమే ఇప్పుడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించి డిమాండ్లను నెరవేర్చే వరకు పోరాటం చేస్తామన్నారు. సంపత్, సాయి, మజూర్, పద్మ, నాగమణి తదితరులున్నారు.

### పోటీ ప్రపంచంలో ఆంగ్లభాషకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే కాలె యాదయ్య

**చేవెళ్ల:** నేడు పోటీ ప్రపంచంలో ఆంగ్లభాష ప్రాముఖ్యత పెరిగిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ప్రతీ ఒక్కరికి ఆంగ్లంపై పట్టు సాధించాలనే ఆలోచన పెరుగుతుందన్నారు. మండలంలోని దేవునిఎర్రవల్లి సమీపంలో ప్రముఖ ఆంగ్లభాష బోధకుడు ఎఎస్ రెడ్డి స్పోకెన్ ఇంగ్లీష్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు ప్రముఖ సాహితీవేత్త ప్రొద్దటూరు ఎల్లారెడ్డి, సర్పంచ్ శైలజ, విద్యాసంస్థల చైర్మన్ శ్రీశైలం ముఖ్య అతిథులు హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంగ్లీష్ భాష ప్రతీ ఒక్కరికి అవసరంగా మారిందని, అందుకు ఈ ప్రాంతంలో ఉండే యువతకు ఇలాంటి కేంద్రాలు ఉపయోగపడుతాయని చెప్పారు. ప్రభుత్వం కూడా ప్రాథమిక స్థాయి నుంచి ఆంగ్లబోధనపై దృష్టి పెట్టిందన్నారు. వైస్ఎంపీపీ శివప్రసాద్, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంక టరంగారెడ్డి, నాయకులు ప్రభాకర్, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

#### గ్రామాల అభివృద్ధే లక్ష్యం

**మొయినాబాద్‌రూరల్:** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నమంగళారం సర్పంచ్ సుకన్య హరిశంకర్‌గౌడ్‌తో పాటు ఎంపీటీసీ బట్టు మల్లేశ్, ఉపసర్పంచ్ గోపాల్, గ్రామస్తులు మర్యాదపూర్వకంగా చేవెళ్ల ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ చేరేలా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణుగౌడ్, స్థానిక నాయులు తదితరులు పాల్గొన్నారు.





అనంతగిరి: వాగు ఉధృతితో ధన్నారం వద్ద నిలిచిన రాకపోకలు



ధారూరు బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

# దంచికొట్టింది

**జిల్లావ్యాప్తంగా భారీ వర్షం**

- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన కలెక్టర్

జిల్లావ్యాప్తంగా మంగళవారం వాన దంచికొట్టింది. ఉదయం నుంచే ఎడతెరిపిలేని వర్షం కురవడంతో ప్రధాన రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వాగులు, వంకలు అలుగుపారాయి. అనంతగిరిగుట్ట రోడ్డు మార్గంలో చెట్లు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ నారాయణరెడ్డి విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ ఆదేశాలు జారీ చేశారు. - సాక్షి, నెట్‌వర్క్



పరిగి: బ్రిడ్జిపై నుంచి పారుతున్న నస్కల్‌వాగు



ధారూరు: కళకళలాడుతున్న పత్తిపంట



మోమిన్‌పేట: చెరువు వద్దకు వెళ్లకుండా ముళ్లకంచె వేస్తున్న జీపీ సిబ్బంది



దౌల్తాబాద్: ఈర్లపల్లిలో జీవం పోసుకున్న పత్తిచేను



అనంతగిరి: ఆలంపల్లిలో నీటిమునిగిన గుడిసె

### నేటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

**కొడంగల్ రూరల్:** పట్టణంలోని శ్రీకేశవ స్వామివారి ఆలయంలో బుధవారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. 6వ తేదీన ప్రారంభమయ్యే ఉత్సవాలు 8వ తేదీన ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

### పెట్రోల్ ట్యాంకర్ బోల్తా

**పెద్దేముల్:** ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఓ పెట్రోల్ ట్యాంకర్ బోల్తా పడిన సంఘటన పెద్దేముల్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. హైదరాబాద్ చర్లపల్లి డిపో నుంచి తాండూరుకు వస్తున్న భారత్ పెట్రోల్ ట్యాంకర్ సోమవారం అర్ధరాత్రి పెద్దేముల్ మండల మంబాపూర్–దుగ్గాపూర్ మధ్యన మలుపు వద్ద బోల్తా కొట్టింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ట్యాంకర్ బోల్తాకొట్టి రోడ్డుపక్కనే ఉన్న పొలాలకు నీరు పారించే కాలువలో పడటంతో ట్యాంకర్‌లో ఉన్న డీజిల్, పెట్రోల్ కాలువ నీటిలో కలిసి పొలాలకు పారింది. ఆ నీరు చుట్టుపక్కల ఉన్న పొలాల్లో చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు పాడయ్యే అవకాశం ఉందని తమకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై పెద్దేముల్ ఎస్ఐ కాశీనాథ్‌ను వివరణ కోరగా ప్రమాద విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.



వరిపొలంలో బోల్తాపడిన ట్యాంకర్

## భారతి సిమెంట్‌తో నాణ్యమైన నిర్మాణాలు

సంస్థ టెక్నికల్ ఇంజనీర్ నితీష్‌యాదవ్

**తాండూరు:** భారతి సిమెంట్ నాణ్యమైన కట్టడాలకు పెట్టింది పేరని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ నితీష్ యాదవ్ అన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని పవన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో భారతి సిమెంట్ సాంకేతిక ప్రమాణాలపై తాపీమేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ ప్రాజెక్టు కట్టడాలకు, ఇంటి నిర్మాణాలకు మార్కెట్‌లో ఇతర సిమెంట్‌లతో పోల్చితే భారతి సిమెంట్‌లో నాణ్యతాప్రమాణాలు అధికంగా ఉంటాయన్నారు. ఇటీవలకాలంలో తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన పలు భారీ ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణాల్లో భారతీ సిమెంట్ వాడటం సంస్థ సాధించిన విజయమన్నారు. అల్ట్రాఫాస్ట్ నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా సిమెంట్ ఉంటుందన్నారు. అనంతరం భారతి సిమెంట్ సంస్థ తరఫున తాండూరు ప్రాంతంలోని 50 మంది తాపీ మేస్త్రీలకు ఒక్కొక్కరిగా రూ.లక్ష చొప్పున ప్రమాద బీమా బాండ్లను అందించారు. భవన నిర్మాణ కార్మికులకు భద్రత కోసం సంస్థ పాటుపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు పవన్ ఏజెన్సీ నిర్వాహకులు సురేంద్రనాద్, ప్రతినిధులు శివ, తాపీమేస్త్రీలు తదితరులున్నారు.



బీమా బాండ్లను అందజేస్తున్న ప్రతినిధులు

# కంప్యూటర్ విద్య కొనసాగేనా?

- ప్రభుత్వ బడుల్లో 2008లో ప్రారంభం
- 2014తో ముగిసిన ఏజెన్సీ ఒప్పందం
- అప్పటినుంచి మూలనపడిన కంప్యూటర్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

**దౌల్తాబాద్:** విజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి మనిషికి తప్పనిసరి అయ్యింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 2008–09 విద్యాసంవత్సరం సెప్టెంబర్‌లో కంప్యూటర్ విద్యను ప్రారంభించింది. ఇందులో భాగంగా మండలంలో మొత్తం 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రారంభించారు.

**కాంట్రాక్టర్లకు అప్పగింత..**

దౌల్తాబాద్ మండల ఉన్నత పాఠశాలతో పాటు బాలంపేట, చల్లాపూర్, గోకఫసల్‌వాద్, నీటూరు పాఠశాలల్లో 2008లో కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఒప్పందం కుదుర్చుకోగా.. ఏజెన్సీ నిర్వహకులు పాఠశాలలకు కంప్యూటర్ లను, జనరేటర్‌ను, నెట్ కనెక్షన్ అందించారు. ఏజెన్సీ వారే ఇన్‌స్ట్రక్టర్లను కూడా నియమించారు. ఆ సమయంలో వారికి నెలకు రూ.3వేలు గౌరవవేతనం ఇచ్చారు. రానును గౌరవవేతనం సరిగా అందించడంలేదని కొందరు ఇన్‌స్ట్రక్టర్లు విధులకు సరిగా హాజరుకాలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు.

**2014తో ముగిసిన ఒప్పందం...**

ప్రభుత్వానికి కాంట్రాక్టర్లకు మధ్య చేసుకున్న 5 సంవత్సరాల ఒప్పందం 2013–14 విద్యాసంవత్సరంతో ముగియడంతో ఇన్‌స్ట్రక్టర్లు వెళ్లిపోయారు. దీంతో మండలంలోని 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 11 కంపూట్యర్లు మూలనపడ్డాయి. 10 సంవత్సరాలుగా కంప్యూటర్లను వాడకపోవడంతో అవి పనిచేయకుండాపోయాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యార్థులకు కంప్యూటర్ విద్యనందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



చల్లాపూర్ పాఠశాలలో నిరుపయోగంగా కంప్యూటర్లు

**నిధులు ఇవ్వట్లేదు**



ప్రభుత్వ బడుల్లో చాలారోజుల నుంచి కంప్యూటర్లను వాడకపోవడంతో అవి పనిచేయడంలేదు. వాటి రిపేర్లకు ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించడం లేదు. భవిష్యత్‌లో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

– వెంకటయ్య, ఎంఈఓ, దౌల్తాబాద్

## కార్యకర్తలకు సముచిత స్థానం



ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

**అనంతగిరి:** వికారాబాద్ మండలం పెండ్లిమడుగు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డుసభ్యుడు విఠల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. గ్రామ సర్పంచ్ బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షుడు కమాల్ రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## 'నందు ఆర్మీ'తో భవిష్యత్‌కు మార్గం



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

- జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేష్‌గుప్తా
- అకాడమీ నుంచి ఉద్యోగాలు సాధించిన 60 మంది ఎస్ఐలకు సన్మానం

**హుడాకాంప్లెక్స్:** నందు ఆర్మీ అకాడమీ భవిష్యత్‌కు మార్గం చూపుతుందని తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌గుప్తా అన్నారు. టీఎస్‌పీఎల్ఆర్‌బీ విడుదల చేసిన ఫలితాల్లో ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైన 62 మంది అభ్యర్థులను నందు ఆర్మీ అకాడమీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఎస్ఐ ఉద్యోగాలు సాధించిన ప్రతీ ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం సమాజంలో జరుగుతున్న విషయాలను తెలుసుకుని, జ్ఞానాన్ని పెంపొందించుకుంటేనే విజయం సాధించగలుగుతామన్నారు. విద్యార్థి దశ నుంచే భవిష్యత్తుకు బాటలు వేసుకునే విధంగా ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం నందు ఆర్మీ అకాడమీ డైరెక్టర్ నందునాయక్ మాట్లాడుతూ.. తమ అకాడమీలో దాదాపు 2వేల మంది శిక్షణ తీసుకున్నారని, ప్రభుత్వం ప్రకటించిన 500 ఎస్ఐ పోస్టులలో తమ దగ్గర శిక్షణ తీసుకున్న విద్యార్థులు 62 మంది ఎస్ఐ ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలంగౌడ్, సర్పంచ్ గోపాల్‌నాయక్, కానిస్టేబుల్ తావురియా నాయక్, సరూర్‌నగర్ ఎస్ఐలు లక్ష్మణ్, రమేశ్, మాధవన్, అకాడమీ కో ఆర్డినేటర్ వెంకటేశ్, శిక్షకులు సిరి పాల్గొన్నారు.

### రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్తాం: కలెక్టర్

**హయత్‌నగర్:** ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో నెలకొన్న రెవెన్యూ, ఇరిగేషన్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని జిల్లా కలెక్టర్ హరీశ్ అన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మన్సూరాబాద్ 93/1లో రెండు ఎకరాల భూమి కబ్జాకు గురైందని దానిని సర్వే చేయించాలని, లింగోజిగూడ గ్రీన్‌పార్కు కాలనీలో నాలా కోసం ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి ఇంత వరకు నివేదిక ఇవ్వలేదని వెంటనే ఇప్పించాలని, జీఓ 118 కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇబ్బందులు ఎదరవుదున్నాయని వాటిని పరిష్కరించాలని, అన్మగల్ సర్వే నెంబర్ 255లో రైతుల నుంచి గతంలో హెచ్ఎండీఏ అధికారులు భూమిని తీసుకుని అభివృద్ధి చేస్తామని ఎలాంటి అభివృద్ధి చేయలేదని రైతులకు వారి భూములను వారికిచ్చి సాగు చేసుకునే విదంగా అదేశాలు ఇవ్వా లని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.. ధాతునగర్ కాలనీలో యూఎల్‌సీ భూములపై తుది నిర్ణ యం తీసుకోవాలని, నందనవనం డబుల్ బెడ్రూం ఇళ్లలో అర్హులైన లబ్ధిదారులు ఉంటున్నారని ఈ ఇండ్ల కేటాయింపునకు లాటరీ తీయకూడదని మ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానికుల అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా సమస్యలపై అధికారులతో విచారణ చేయించి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కిస్తామన్నారు. ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, హయత్‌నగర్, సరూర్ నగర్ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

## తండాలకు రూ.21.40 కోట్ల నిధులు

**34 కి.మీ మేర బీటీ రోడ్ల నిర్మాణం**

- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

**బొంరాస్‌పేట:** కొడంగల్ నియోజకవర్గంలోని గిరిజన తండాలు, పల్లెల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 21.40కోట్లు మంజూరయ్యాయి. మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఈ మేరకు జీవో విడుదల చేసింది. నిధుల మంజూరుపై ప్రజాప్రతినిధులు, నేతలు శేరినారాయణరెడ్డి, విష్ణువర్ధన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని భోజన్నగడ్డ తండా నుంచి మైసమ్మగడ్డ తండా వరకు రూ. కోటి 30లక్షల 40వేలు, వాల్యానాయక్ తండా రోడ్డుకు రూ. 65 లక్షల 20వేలు, బాపల్లి తండా నుంచి సీత్యానాయక్ తండా వరకు రూ. కోటి 30లక్షల 40వేలు, మదన్‌పల్లి తండా నుంచి ఇబ్రహీంపూర్ శివారు వరకు రూ. 97 లక్షల 80వేలు, జాతీయ రహదారి నుంచి బాపన్‌చెర్వు తండా వరకు రూ. కోటి 63లక్షలు, మూడుమామిళ్ల తండా నుంచి డీప్లానాయక్ తండా వరకు రూ. 84లక్షల76 వేలు, హంసాన్‌పల్లి బీటీ రోడ్డు నుంచి నాన్‌చెర్వు తండా, సత్తర్‌కుండ తండా, బొల్లిబాయి తండాల మీదుగా చెట్టుపల్లి తండా వరకుకు రూ. 2కోట్ల 60లక్షల 80వేలు మంజూరయ్యాయి. అలాగే కొడంగల్ మండలం ఆసిరెడ్డిబాయి తండా, టేకులకోడు తండా రోడ్లకు రూ. కోటి 95లక్షల 60వేలు. దౌల్తాబాద్ మండలం కిష్యానాయక్ తండా, వాల్కి తండా రోడ్లకు రూ. రెండు కోట్ల 8లక్షల 64 వేలు, మద్దూరు మండలం మోత్కులకుంట, మేడికుంట తండా మీదుగా చెల్లాపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.7 కోట్లా 17లక్షల 20వేలు, కోస్గి మండలం హనుమాన్‌పల్లిలో రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 30లక్షల 40వేలు మంజూరయ్యాయి.

## ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించండి

డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి

**కొత్తూరు:** ఆరోగ్యంపై మహిళలు జాగ్రత్తలు పాటించాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి సూచించారు. మంగళవారం నందిగామ మండల కేంద్రంలోని పీహెచ్‌సీని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళల్లో తరచుగా వచ్చే అనారోగ్య సమస్యలు, వాటి నివారణపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పీహెచ్‌సీలు, ఆరోగ్యకేంద్రాల్లో మహిళలు, గర్భిణులకు అందిస్తున్న సేవల వివరాలను రిజిస్ట్రర్లలో తప్పకుండా నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఆశాలకు హెచ్‌బీఎన్‌సీ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు తులసీ, ఝాన్సీ, మానస, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆశలకు కిట్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ జయలక్ష్మి